క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గుంటూరు రూరల్: గుర్తు తెలియని మృత దేహం లభ్యమైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపలకలూరు రోడ్డు గుంటూరు క్లబ్ పక్కనున్న స్థలంలో గల వాటర్ సంప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని సమాచారం మేరకు సంఘటన స్థలికి పోలీసులు చేరుకున్నారు. మృతుడు నాలుగైదు రోజుల కిందట చనిపోయినట్లు భావిస్తున్నారు. సుమారు 35 సంవత్సరాలు ఉంటాయి. మృతదేహం గుర్తు పట్టలేనంతగా ఛిద్రమైంది. చేతిపై ఓం అని పచ్చబొట్టు ఉంది. ఆచూకీ తెలిసిన వారు నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ రాంబాబు కోరారు. మృతుడు తాగిన మత్తులో పడ్డాడా లేక ఆత్మహత్య లేదా ఎవరైనా కావాలని చేశారా ? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండవరంలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ప్రారంభం



గుండవరం(చేబ్రోలు): మండలంలోని గుండవరంలో శనివారం చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా శిబిరం ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ చుక్కా సాయి నాగేంద్రమ్మ మెడికల్ క్యాంప్‌లో మందులు పంపిణీ చేసి, ప్రారంభించారు. గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాల్ని చేపట్టనున్నారు. ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ పీవో పి. శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యంగా యువతకు శిక్షణ తరగతులు



గుంటూరు రూరల్: గ్రామీణ యువతీయువకులకు ఉపాధి లక్ష్యంగా కృషి విజ్ఞాన కేంద్రం పలు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ తెలిపారు. గత ఆరు రోజులుగా నగర శివారుల్లోని లాం నందున్న కేవీకేలో వానపాముల ఎరువుల తయారీపై యువతీ, యువకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వానపాముల ఎరువు, వర్మికంపోస్ట్ తయారీకి ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ వర్మికంపోస్ట్, వానపాముల ఎరువుల షెడ్ల నిర్మాణానికి నాబార్డ్, ఎల్‌డీఎం బ్యాంకులు రుణాలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం శిక్షణ తరగతుల్లో పాల్గొన్న యువతీ, యువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. గంగాదేవి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ



గుంటూరు రూరల్: ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో నగదు అపహరించిన సంఘటన హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం వెలుగు చూసింది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీసాయి రెసిడెన్సిలో ఎం.మల్లికార్జునరావు నివాసం ఉంటున్నారు. బ్యాంకులో పని చేసి రిటైర్ అయ్యారు. ఈనెల 9న ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం వెళ్లారు. శనివారం ఉదయం ఇంటి పక్కనున్నవారు తలుపులు తీసి ఉన్నాయని ఫోన్ చేసి చెప్పడంతో తిరిగి వచ్చారు. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని నగదు, ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. బంగారు ఆభరణాలు, రూ. 2 లక్షలు నగదు చోరీకి గురైనట్లు మల్లికార్జునరావు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైర్‌లెస్ నెట్‌వర్క్స్‌కు విస్తృత ప్రాముఖ్యత

పెదకాకాని: రానున్న రోజుల్లో వైర్‌లెస్ నెట్‌వర్క్స్‌కు విస్తృత ప్రాముఖ్యత ఉందని స్వీడన్‌కు చెందిన ఎరిక్సన్ సంస్థ రీసెర్చ్ అండ్ డెవలపర్ గుంటుపల్లి లక్ష్మీకాంత్ తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) కళాశాలలో శనివారం ఎల్రక్టానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో త్వరితగతిన వైర్‌లెస్ నెట్‌వర్క్స్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా లక్ష్మీకాంత్ హాజరయ్యారు. సమాచార లోపాలు, కమ్యూనికేషన్ ప్రాముఖ్యతను ఆయన విద్యార్థులకు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా సమాచార రంగం విస్తృతంగా వ్యాప్తి చెందుతోందని, దానికి తగినట్లుగా నెట్‌వర్క్స్ సమాచారం త్వరితగతిన అందించేలా కావాలని సూచించారు. సెల్యులర్ కమ్యూనికేషన్స్, జెనరేషన్స్ మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. కమ్యూనికేషన్స్‌లో ఎక్కువగా జరిగే కాల్ డ్రాప్స్, ట్రాఫిక్ కంట్రోల్, కమ్యూనికేషన్స్ మధ్య జాప్యం ఏ విధంగా జరుగుతుందో వివరించారు. సదస్సులో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు.. చంద్రబాబు హయాంలో పశు వైద్యం అంపశయ్యపై ఉండేది. వ్యాధి నిర్ధారణ సంగతి అటుంచితే గ్రామాల్లో అందడమే గగనంగా ఉండేది. పశు వైద్యశాలలు అక్కడక్కడా ఉన్నప్పటికీ ఫలితం నామమాత్రమే. అడపాదడపా ఉన్నవాటిలోనే మాత్రలిచ్చి పంపేవారు. మహా అయితే ఓ సూది మందు ఇచ్చేవారు. అదికూడా పనులు మానుకుని సుస్తీ చేసిన మూగజీవాన్ని ఆస్పత్రి వరకు తోలుకు వెళితేనే. అక్కడ కూడా వ్యాధి నిర్ధారణ చెయ్యాలంటే కనీస పరికరాలు ఉండేవి కావు. గుంటూరు లేదా నరసరావుపేటలోని ల్యాబ్‌కో పశువును తోలుకెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుని రావాల్సిన దుస్థితి పాడి రైతులది.

నేడు.. వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పశువైద్యంపైనా దృష్టి సారించారు. మూగజీవానికి కష్టమొస్తే తక్షణ వైద్యం అందించాలన్న దానిపై పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ కేంద్రంలో పశువుల వ్యాధి నిర్ధారణకు ప్రయోగశాలను అందుబాటులోకి తెచ్చారు. మనుష్యులకు ఎన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తారో.. పశువులకూ అన్నీ చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ మొదలు చికిత్స వరకూ అంతా నిమిషాల్లో జరిగిపోతోంది. పాడి రైతులకు వ్యయప్రయాసలు తప్పుతున్నాయి.

మూగజీవులకూ ప్రయోగశాల

- నియోజకవర్గ కేంద్రంలోని అగ్రి ల్యాబ్‌లో సీఏడీడీఎల్ కేంద్రం
- తొమ్మిది రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- ఇప్పటి వరకు 7,010 శాంపిల్స్ సేకరణ
- రైతులకు ప్రయోజనకరంగా ల్యాబ్ సేవలు



గ్రామాల్లో పశువైద్య శిబిరం నిర్వహించి పశువుల నుంచి శాంపిల్స్ సేకరిస్తున్న ల్యాబ్ సిబ్బంది

ఇప్పటి వరకు చేసిన పరీక్షలు

- 1-7-21 నుంచి 31-3-2022 వరకు 822
- 1-4-22 నుంచి 31-3-2023 వరకు 2829
- 1-4-23 నుంచి 5-2-2024 వరకు 3359
- మొత్తం మూడేళ్లలో చేసిన పరీక్షలు: 7010

ప్రత్తిపాడు: నియోజవకర్గ కేంద్రం ప్రత్తిపాడులో రూ. 65 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లోనే సీఏడీడీఎల్ (నియోజకవర్గ పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం)ను ఏర్పాటు చేశారు. జంతువుల ఆరోగ్యకరంగా ఉండటానికి, పశువుల ఉత్పత్తికి అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇక్కడ నిర్వహిస్తారు. జంతువుల పేడ, మూత్రం, పాలు, రక్తం, చర్మం, ముట్టి నుంచి కారు నీరు వంటి పలు నమూనాలను సేకరించి రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. పశు వైద్యశాలలు, ఆర్‌బీకేల నుంచి వచ్చిన శాంపిల్స్‌తో పాటు పశువైద్యాధికారులు, ల్యాబ్ సిబ్బంది ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహించి రక్తనమూనాలు, శాంపిల్స్‌ను సేకరిస్తున్నారు.



ల్యాబ్‌లో శాంపిల్స్‌ను పరీక్షిస్తున్న ఎల్‌టీ

పాడి రైతులకు ఎంతో మేలు



పశువుల ప్రయోగశాల వల్ల పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. నియోజకవర్గ కేంద్రంలో ల్యాబ్ ఉండటం వల్ల త్వరితగతిన వ్యాధి నిర్ధారణ చేసి నయం చేయగలుగుతున్నాం. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, నరసరావు పేటల్లో మాత్రమే పశు ప్రయోగశాలలు ఉండేవి. రెండు, మూడు రోజులు చూసి రోగం నయం అవ్వకపోతే అక్కడకు రెఫర్ చేసేవాళ్లం. కానీ ఇప్పుడు నియోజకవర్గ కేంద్రాల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతో ఆ సమస్య తొలగింది. పాడి రైతులు సేవల్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె. శ్రీనివాసరెడ్డి (సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, ప్రత్తిపాడు)

సమగ్రంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు



పశువులకు సంబంధించిన అన్ని రకాల రోగాలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తాం. ల్యాబ్ సేవలు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఏడు వేలకు పైగా శాంపిల్స్‌ను పరీక్షించి, ఫలితాలను అందించాం. పాడి రైతులు, అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ల్యాబ్ సేవలను వినియోగించుకోవాలి.

– డి. అశోక్‌కుమార్ (ఎల్‌టీ, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం, ప్రత్తిపాడు)

అన్ని రాష్ట్రాలకు ఏపీ ఆదర్శం

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- చేబ్రోలులో రూ. 4.74 కోట్లతో నిర్మించిన మూడు సచివాలయాలు, రహదారుల ప్రారంభం



లేమల్లెపాడులో రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో చేపట్టిన పెను మార్పులు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలులో రూ. 4.74 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్ని శనివారం ఆయన ప్రారంభించారు. చేబ్రోలులోని మార్కెట్టు సెంటర్‌లో రూ.43.60లక్షల వ్యయంతో నిర్మించిన చేబ్రోలు-3 గ్రామ సచివాలయం, పాతరెడ్డిపాలెంలోని చేబ్రోలు-4, కొత్తరెడ్డిపాలెంలోని చేబ్రోలు-5 గ్రామ సచివాలయాల నూతన భవనాల్ని ప్రారంభించారు. రూ.2.90కోట్లతో చేబ్రోలు నుంచి లేమల్లెపాడు వెళ్లే రహదారిని, కొత్తరెడ్డిపాలెంలో రూ.53 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం చేబ్రోలు-5 గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అధిక నిధులు ఇచ్చి పనులు చేపట్టిందని తెలిపారు. పొన్నూరు నియోజకవర్గంలో రూ.1600కోట్లను సంక్షేమ పథకాల ద్వారా అందించినట్లు వెల్లడించారు. చేబ్రోలులో ఐదు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, కూరగాయల మార్కెట్టు అభివృద్ధి, సులభ్ కాంప్లెక్స్, సిమెంటు రహదారులు, సైడ్ కాలువలు, వైఎస్సార్ కళా ప్రాంగణం, ప్రధాన రహదారి విస్తరణ తదితర పనులను రూ. 100 కోట్లతో చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పొన్నూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు జైపాల్‌రెడ్డి, ఆదాం, కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, షేక్ పెదమస్తాన్, జి. శ్రీరెడ్డి, బి. అప్పిరెడ్డి, చౌదయ్య, శివరామకృష్ణ, స్థానిక పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. చేబ్రోలు-4 గ్రామ సచివాలయం, ఇతర భవనాలకు సుమారు రూ.60లక్షల విలువ చేసే 26సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన గోవిందరెడ్డిని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఘనంగా సన్మానించారు

సంక్షేమ పాలనకు కేరాఫ్ సీఎం జగన్



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని, తనను ఆశీర్వదించాలని కోరుతూ కరపత్రాలు అందజేస్తున్న బలసాని

- ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- మేడావారిపాలెంలో 'గుండెగుండెలో జగనన్న- గడపగడపకూ మన కిరణన్న'

మేడావారిపాలెం (ప్రత్తిపాడు): సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి సర్కారు సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్ అని నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు మండలం మేడావారిపాలెంలో శనివారం రాత్రి 'గుండెగుండెలో జగనన్న- గడపగడపకూ మన కిరణన్న' కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన కిరణ్‌కుమార్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్థానికంగా ఉన్న దేవాలయాలు, చర్చిలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గడపగడపకూ వెళ్లి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సర్కారును మరోసారి గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.

అవ్వా పింఛను అందుతుందా ?

గ్రామంలో పర్యటించిన బలసాని వృద్ధులకు అందుతున్న పింఛనుపై ఆరా తీశారు. నెల నెలా పింఛను వస్తుందా? ఒకటవ తేదీనే వలంటీరు వచ్చి అందిస్తున్నారా? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి 108, 104 వాహనాలు వస్తున్నాయా? ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా? అని ప్రశ్నించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛను అందుతుందని వృద్ధులు బలసానికి తెలిపారు. మీ అందరి ఆశీస్సులు మరోసారి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తనకు అందించాలని కోరారు. అందరి దీవెనలతో ఆయన ముఖ్యమంత్రిగా మరలా ప్రభుత్వం కొలువుదీరాలని విన్నవించారు. వెళ్లిన ప్రతి గడపలోనే ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఓటు నీకు, జగన్‌కే బిడ్డా ! అంటూ అవ్వతాతలు దీవెనలందించారు.

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్ట్



కేసు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ రమేష్

పొన్నూరు: వివాహేతర సంబంధం నేపథ్యంలో మహిళ హత్యకు కారణమైన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెనాలి డీఎస్పీ ఎం.రమేష్ తెలిపారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసునకు సంబంధించిన వివరాలు తెలిపారు. పొన్నూరు మండలంలోని మన్నవ గ్రామానికి చెందిన దమ్ము సునీత అదే గ్రామానికి చెందిన దమ్ము వంశీతో మూడేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఈ విషయం భర్తకు తెలిసి ఇంట్లో వివాదాలు జరగడంతో గత కొన్ని రోజులుగా ఆమె వంశీతో అక్రమ సంబంధాన్ని నిరాకరించింది. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న వంశీ తరచూ గొడవ పడుతున్నాడు. ఈనెల 13న పొన్నూరులో ఉంటున్న తల్లి వద్దకు సునీత వచ్చిందని తెలుసుకొని వంశీ అక్కడికి వచ్చి తనతో వివాహేతర సంబంధాన్ని కొనసాగించాలని బెదిరించాడు. అయినా ఆమె నిరాకరించడంతో తనతో పాటు తెచ్చుకున్న గడ్డి మందును ఆమె నోట్లో బలవంతంగా పోసి పారిపోయాడు. స్థానికులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి సునీతను తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసిన పట్టణ సిఐ పి.భాస్కర్ దర్యాప్తు చేశారు. శనివారం దొప్పలపూడి అడ్డరోడ్డులో నిందితుడు దమ్ము వంశీని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు.

చెడు అలవాట్లతో జీవితం నాశనం

గుంటూరు రూరల్: మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్లు మనిషి జీవితాన్ని నాశనం చేస్తాయని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సమీపంలోని తాతిరెడ్డిపాలెంలో ప్రజలకు మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్ల వల్ల కలిగే నష్టాల్ని విద్యార్థులు వివరించారు. శరీరంలోని ఏ భాగాలు దెబ్బతింటాయో తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆర్‌వీఆర్‌జేసీ వార్షికోత్సవం



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్న సినీ హీరో గోపీచంద్

గుంటూరు రూరల్: జీవితంలో విద్యార్థి దశ మధుర జ్ఞాపకాలను నింపే విధంగా ఉండాలని, అందుకు తగ్గట్టు విలువైన సమయాన్ని ఉన్నత స్థాయి చేరే లక్ష్యంతో సరైన ప్రణాళికను రూపొందించుకోవాలని ప్రముఖ సినీ నటుడు తొట్టెంపూడి గోపీచంద్ సూచించారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల 39వ వార్షికోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో హీరో గోపీచంద్ మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాన్ని ఎంతటి కష్టమైనా సాధించేందుకు ప్రతి విద్యార్థి సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అడ్వైజర్ ప్రొఫెసర్ వజ్జా సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఆవిష్కరణల్ని ఆవిష్కరిస్తూ అంకుర పరిశ్రమల స్థాపన దిశగా కృషి చేయాలని తెలిపారు. ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల సాధిస్తున్న ఫలితాలు, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు అభినందనీయమన్నారు. అనంతరం కళాశాలలో అర్హులైన 277 మంది విద్యార్థులకు రూ. 20 వేల చొప్పున అందజేశారు. వివిధ కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 19 మంది విద్యార్థుల్ని ఎంపిక చేసి ఫస్ట్ అండ్ సెకండ్ ర్యాంకులను ప్రకటిస్తూ ఎండోమెంట్ క్యాష్ అవార్డులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. 2006 – 2007 వార్షిక విద్యా సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 2,099 మంది విద్యార్థిని,విద్యార్థులకు రూ. 3,53,40,000 నగదు స్కాలర్ షిప్‌లను అందజేసినట్లు కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల జానపద, సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు వివిధ రకాల ఆటల పోటీల స్టాల్స్ ఆకర్షింపజేశాయి. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, పాలక మండలి సభ్యులు గద్దె మంగయ్య, పి. గోపీచంద్, కె. రంగారావు, కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, కార్యక్రమ నిర్వాహక కన్వీనర్ పి. కిశోర్, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ, అనుబంధ కళాశాలల పాలకవర్గ సభ్యులు, ప్రిన్సిపాల్స్, కళాశాల వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధికారులు శ్రద్ధతో పనిచేయాలి

- కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి
- పాలవెల్లువ కేంద్రాల్లో ఆకస్మిక తనికీలు



జీజీపాలెంలో కేంద్రంలోని సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ తదితరులు

ప్రత్తిపాడు: జగనన్న పాలవెల్లువను విజయవంతం చేయడానికి అధికారులు శ్రద్ధతో పని చేయాలని కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి తెలిపారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమం క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరును నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు-3 గ్రామ సవాలయంలోని పాల సేకరణ కేంద్రంతో పాటు, పెదనందిపాడు మండలం జీజీపాలెంలోని బల్క్ మిల్క్ కూలింగ్ సెంటరు, పాల సేకరణ కేంద్రంలో కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి తనిఖీలు జరిపారు. పాతమల్లాయపాలెంలో సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి పరిశీలించారు. ప్రత్తిపాడులో కలెక్టర్ పాడి రైతులతో మాట్లాడారు. గతంలో లీటరుకు రూ.41 ఇచ్చేవారని, ఇప్పుడు రూ.60 వరకు ఇస్తున్నారని, అదనంగా రూ.20 వరకు లాభం చేకూరుతున్నట్లు రైతులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. పాల కేంద్రంలో పాలుపోసేందుకు వచ్చిన రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. సిబ్బందికి సరైన శిక్షణ అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ డెప్యూటీ సీఈవో జె.మోహనరావు, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

ఆహ్వానించిన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



గొల్లమూడిలో కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: పెత్తందారి వ్యవస్థ, దుష్ట టీడీపీతో విసిగిపోయిన పొన్నూరు ప్రజలు 2019 ఎన్నికలలోనే ధూళిపాళ్ల నరేంద్ర అరాచక పాలనకు చరమగీతం పాడారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ధ్వజమెత్తారు. ఇకపై ఎన్నడూ టీడీపీకి ఓటేసేందుకు పొన్నూరు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా లేరని తెలిపారు. మండలంలోని గొల్లమూడిపాడుకు చెందిన టీడీపీ నేత ఖగ్గా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు వేల్పూరి శివశంకర్ ఆధ్వర్యంలో పది కుటుంబాలు, వల్లభరావుపాలేనికి చెందిన నాయకులు స్వచ్ఛందంగా శనివారం టీడీపీని వీడి ఎమ్మెల్యే రోశయ్య సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రోశయ్య కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో ఖగ్గా గోపి, ఖగ్గా కల్యాణ్, ఓగిబోయిన నాగరాజు, ఖగ్గా శ్రీహరి, ఖగ్గా వెంకయ్య చౌదరి, ఖగ్గా రాములు, ఖగ్గా బాలకృష్ణ, వేల్పూరి రామకోటేశ్వరావు, వేల్పూరి వెంకయ్య, సాంబశివయ్యలకు చెందిన కుటుంబ సభ్యులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రుద్రపాటి ఆదిశేషులు, పట్టణ అధ్యక్షులు షేక్ మహమ్మద్, మునిపల్లె పీఏసీఎస్ అధ్యక్షులు కోట శ్రీనివాసరావు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, బీసీ నాయకులు కొల్లేరు శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ భవనం వంశీరెడ్డి , పట్టణ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

పట్టణంలోని మెయిన్ రోడ్డులో అభివృద్ధి పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన పనుల్ని పరిశీలించారు. సైడ్ డ్రెయిన్స్, రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

150 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

చేబ్రోలు: మండలంలోని కొత్తరెడ్డిపాలేనికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన 150 కుటుంబాలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నట్లు నాయీ బ్రాహ్మణ వర్గానికి చెందిన జాజాల శివయ్య, జాజాల శ్రీనివాసరావు, నారాయణ, రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, భవనం పుల్లారెడ్డి, ఇంటూరి జైపాల్‌రెడ్డి, శ్రీరెడ్డి, గైరుబోయిన వెంకట సుబ్బయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా మండలాభివృద్ధికి కృషి: ఎంపీపీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హెప్సిబా

పెదనందిపాడు: మండలాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ టి. హెప్సిబా సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో జరిగే సభలు, సమావేశాలకు తప్పనిసరిగా ప్రజాప్రతినిధులు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మంచిపేరు తీసుకురావాలని ఆమె సూచించారు. ముందుగా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షేక్ ఖాశింబీ, వైస్ ఎంపీపీ- 2 కమ్మ సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు జంగా సుందర్, షేక్ రమేష్, మేడిద మాలతి, ఇంచార్జి ఎంపీడీవో స్వామిరెడ్డి, సర్పంచులు దాసరి పద్మారావు, సాతులూరి సురేష్, చెన్నుపాటి నరసింహారావు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

గుంటూరు రూరల్: మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నల్లపాడు సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఏటుకూరులోని తిరుమల అయ్యప్ప రియల్ ఎస్టేట్ ప్లాట్లలో ఈనెల 10న గుర్తు తెలియని మహిళను మారణాయుధాలతో హత్య చేసిన సంఘటన తెలిసిందే. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. మహిళ నల్లచెరువుకు చెందిన కలవ నాగపూజగా గుర్తించారు. ఆమెకు గతంలో పరిచయస్తుడైన రేటూరి నాగరాజుతో వివాహేతర సంబంధం ఉంది. దీంతో అతడు ఉద్దేశపూర్వకంగా నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లి రాళ్లతో తలపై మోది హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు తరలిస్తూ తీర్పు చెప్పారు.